





# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూలై 05, 2026 సంపుటి : 2 సంచిక : 263 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## మిడ్జిల్‌లో నాటిన మొక్క ..
# మహావృక్షమైంది

## పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం

- పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు
- పాలమూరు బిడ్డలు పార పట్టగలరు..పాలన చేయగలరు
- మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది
- మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే
- బిఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు
- ఆకుటుంబాలకు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు ఎలా వచ్చాయి
- మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్,జూలై4 :**
ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది.

మిగతాద్ది 2 లో



## యుద్ధం వేళ ఇంధన
# సంక్షోభాన్ని అధిగమించాం

## ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి

» అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం
» రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ






**జయపుర,జులై4 :**
పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు.

మిగతాద్ది 2 లో

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

» అపరిశుభ్ర వాతావరణం..కల్తీ పదార్థాలు
» దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు
» వందరోజుల్లో 185 కేసులు నమోదు




**హైదరాబాద్,జులై4 :**
ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

2లో..



## ఘనంగా ఐఐటీ ఖరగ్‌పూర్ స్నాతకోత్సవం.. తెలంగాణ విద్యార్థికి బంగారు పతకాలు

**ఖరగ్‌పూర్:**
ఐఐటీ ఖరగ్‌పూర్ 72వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. తెలంగాణకు చెందిన కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి కంచర్ల ప్రణవ్ రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి ముజుందార్, ఆచార్య నిచోలాస్ బి.డ్రిర్క్స్, విశిష్ట అతిథిగా రాష్ట్ర మంత్రి దిలీప్ ఘోష్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 3936 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

## అభివృద్ధి కార్యాక్రమాల్లో
# వేగం పెంచాలి

» క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత
» రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు
» ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో సమన్వయంతో పనిచేయాలి
» అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్ధేశం



2 లో

**హైదరాబాద్,జూలై4 :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్పూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు.



## జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

- నిజామైన ప్రజానాయకుడు మన రేవంత్
- ప్రజల కోసం పరితపించే పెద్ద మనసు ఆయన సొంతం
- నిరంతరం పేదల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తి
- మిడ్చిల్ సభలో సిఎం రేవంత్‌పై భట్టి ప్రశంసలు

2 లో

**నాగర్‌కర్నూలు,జూలై4 :**
తనను ఆదరించిన ప్రజల దీవన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు.

## భట్టి విక్రమార్క
# గోబెల్స్ ప్రచారం

## అప్పులపై తప్పుడు లెక్కలు

- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- బిఆర్ఎస్ దిగిపోయేనాటికి అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే.
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,జూలై4 :**
బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే.

మిగతాద్ది 2 లో

# వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్,జూలై4 :**

మిగతాది 2లో



మిగతాది 2లో

## గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

మొదటిపేజీ తరువాయి
ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర
ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

## రొయ్యల సాగులో 'వైట్ గట్' వ్యాధి

### - అధికారులను అప్రమత్తం చేసిన అచ్చన్నాయుడు

రాష్ట్రంలో రొయ్యల సాగులో 'వైట్ గట్' వ్యాధి లక్షణాలపై మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత పర్యవేక్షణ చేపట్టాలని, అవసరమైన నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు మత్స్యశాఖ అధికారులు సంబంధిత ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మహదేవిపట్నంలోని ప్రభావిత రొయ్యల చెరువును అధికారులు సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. అక్కడి నుంచి నీరు, రొయ్యలు, ఫీడ్, ఫీకల్ నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలలకు పంపించారు. రొయ్యల నమూనాలను కైకలూరు ప్రయోగశాలకు, నీటి నాణ్యత పరీక్షల కోసం భీమవరం ప్రయోగశాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే సమస్యపై సమగ్ర అధ్యయనం కోసం ఫిషరీస్ యూనివర్సిటీ వంటి సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శాస్త్రీయ సూచనల మేరకు వ్యాధి నియంత్రణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

## భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్తత బిజెపి నేతలను అడ్డుకున్న పోలీసులు

- కాంగ్రెస్, బిఆర్ఎస్ అపవిత్రం చేశారంటూ ఆరోపణ
- పరస్పర విమర్శలతో స్థానికంగా ఉద్రికత

వరంగల్ నగరంలోని ప్రముఖ భద్రకాళీ ఆలయం వద్ద వరుసగా రెండోరోజు శనివారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తడిబట్టలతో ఆలయంలో స్నానాలు చేయడం వల్ల ఆలయం అపవిత్రమైందని ఆరోపిస్తూ, ఆలయ సంప్రోక్షణ నిర్వహించేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆలయానికి చేరుకున్నారు. అయితే, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు బీజేపీ నాయకులను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని పేర్కొంటూ సంప్రోక్షణ నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు, శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రకాళీ ఆలయం వద్ద జరిగిన ఈ పరిణామంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల వేలం వ్యవహారం రాజకీయ రగడ సృష్టిస్తోంది. ఈ వేలం వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత 'కుడా' ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు తడి దస్తులతో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అధికార, విపక్ష సవాళ్లతో భద్రకాళి ఆలయంలో ఉద్రిక్తత నెలకొంది. ఆలయాన్ని రాజకీయాలతో అపవిత్రం చేశారని.. సంప్రోక్షణకు భాజపా పిలుపునివ్వడంతో తాజాగా మరోసారి రాజకీయం వేడెక్కింది. 'శుద్ధి' కార్యక్రమం పేరుతో ఆలయం వద్దకు వచ్చిన భాజపా నేతలను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

## నీలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఒడిశాకు చెందిన దంపతులు తమ ఆరు రోజుల మగ శిశువును ఆస్పత్రిలో చేర్చారు. శిశువు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 25న శిశువును నీలోఫర్‌లో చేర్చిన తల్లిదండ్రులు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పసికందును నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎన్‌బీసీయూలో చికిత్స అందించి.. శిశువును కాపాడారు. ఆసుపత్రి ఆర్ఎంఓ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పసికందును సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శిశువు తల్లిదండ్రులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## బ్రిటిష్ వారిని ఎదరించిన మన్యం వీరుడు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. వీర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, ఆ స్వాతంత్య సమరయోధుడికి ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు.÷ారత స్వాతంత్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఆయన పోరాటం కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని చెప్పారు. ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని వ్యాఖ్యానించారు. స్వాతంత్యాన్ని కాపాడాలంటే బాధ్యతతో జీవించాలని... దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని చెప్పుకొచ్చారు. అందరం ఆ మహనీయుని ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొంది, న్యాయం, సేవ, దేశభక్తి వంటి విలువలను ఆచరిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములం కావాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

## జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

మొదటిపేజీ తరువాయి
రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అక్కాచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే అజెండాగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

## నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

మొదటిపేజీ తరువాయి
మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు.
రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ఈఎఈక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100, ఊ-ఈం÷ వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బదీ చర్యలు ఆహార భద్రతను కట్టుదిట్టంగా అమలు

### - డ్రగ్ కంట్రోలర్ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలసి పనిచేయాలి
### - అధికారులకు సిఎస్ సంజయ్ జాజూ ఆదేశం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో
సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

మొదటిపేజీ తరువాయి
కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారు. తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారిపోవు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తోందని అన్నారు.

## మిడ్జిల్‌లో నాటిన మొక్క ..మహావృక్షమైంది

మొదటిపేజీ తరువాయి
రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి
క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయన్నారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం' అని మంత్రి పొంగులేటి తెలిపారు.
ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

మొదటిపేజీ తరువాయి
తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యం పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని సీఎస్ స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రాధాన్యతా అంశాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిరంతర సమీక్షలు జరపాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

## గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి
గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రిపుల్ ఐటీ భవనంపై నుంచి దూకిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని ఖమ్మం జిల్లాకు చెందిన అభిరూప్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. అనిరుధ్.. కంప్యూటర్ సైన్స్ సెకండియర్ చదువుతున్నాడు. తాను ఉంటున్న బిల్డింగ్ ఆరో అంతస్తు నుంచి దూకిన అనిరుధ్.. గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం.

# పార్టీ పేరు మార్చుకో తల్లి

# కవితకు ఎన్నికల సంఘం షాక్

**కరపత్రం బ్యూరో, హైదరాబాద్**
కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీకి భారత ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. ప్రస్తుతం "టీఆర్ఎస్" పేరును కొనసాగించేందుకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ పార్టీ పేరును మార్చాలని ఆదేశించింది.

టీఆర్ఎస్ పేరుపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.




**» తెలంగాణ అస్తిత్వం, భావోద్వేగాలకు ముడిపడిన "టీఆర్ఎస్" పేరును మరో రాజకీయ పార్టీ వినియోగించడంపై తెలంగాణ నలుమూలల నుంచి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయని పేర్కొంది.**

» ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా

**మూడు ప్రత్యామ్నాయ పార్టీ పేర్లను సమర్పించాలని కవితకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. గడువులోగా ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించకపోతే పార్టీ నమోదు దరఖాస్తును తిరస్కరిస్తామని స్పష్టం చేసింది.**

ఇప్పటికే 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మార్చుకున్న కవిత పార్టీ.. ఇప్పుడు మరోసారి కొత్త పేరు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీంతో పార్టీ ఏర్పాటైన కొద్ది కాలంలోనే మరోసారి పేరు మార్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, కవిత పార్టీకి "టీఆర్ఎస్" పేరు పెట్టడంపై మొదటి నుంచే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

**» ఒకప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరుతో పోలిక ఉండటంతో ప్రజల్లో గందరగోళం ఏర్పడుతుందని, తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన పేరును కొత్త పార్టీ ఉపయోగించరాదంటూ పలువురు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు.**

ఆ అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం పార్టీ పేరు మార్చాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించిన తర్వాత వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం వెల్లడించింది.

# 10న జోగిపేట చేనేత సంఘం పోలింగ్.. బరిలో 13 మంది

**-శనివారంతో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ**
**-5న పరిశీలన, 6న ఉపసంహరణ, 7న గుర్తుల కేటాయింపు**
**-10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్**

**కరపత్రం ప్రతినిధి అందోలు (జులై 04)**
సంగారెడ్డి జిల్లా జోగిపేట లో జరగబోయే చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘానికి ఈనెల 10వ తేదీన జరగనున్న ఎన్నికల్లో భాగంగా మొదటి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ శనివారంతో ముగిసినట్లు ఎన్నికల అధికారి విజారత్ అలీ తెలిపారు.మూడు రోజుల్లో 13 నామినేషన్లు మొత్తం మూడు రోజుల వ్యవధిలో 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఆయన విలేకరులకు వెల్లడించారు. చేనేత సంఘం పాలకవర్గ ఎన్నికలపై సభ్యుల్లో ఆసక్తి



నెలకొంది.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, 5వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపడతారు. 6వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 7వ తేదీన పోటీలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు. 10న పోలింగ్, అదే రోజు ఫలితాలు , 10వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన



వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారి విజారత్ అలీ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ..కార్మికుల, సభ్యత్వ ఓటర్లు అందరూ మన చేనేత సంఘం అభివృద్ధిని కాంక్షించే, కార్మికుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే అభ్యర్థులను గుర్తించి, ఆలోచించి మీ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. సంఘం సభ్యులు ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు గురి....

**- 523 సర్వే నెంబర్ లో ప్రభుత్వ భూమి కబ్జా..**
**- ఇటిక్యాల రెవెన్యూ గ్రామంలో భూకబ్జా.**
**-సీలింగ్ పట్టా 1ఎకరంఇస్తే,కడిలు వేసింది 2 ఎకరాలకు.**

**జగదేవపూర్ జులై 04 కరపత్రం ప్రతినిధి**
జగదేవపూర్ మండలం కొత్తపేట గ్రామ ఇటికాల రెవెన్యూలో సర్వేనెంబర్ 523 లో 11 ఎకరాలు కబ్జా గురైంది. ఈ సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమి 24 ఎకరాలు ఉండేది. గతంలో పలువురు తల ఎకరం చొప్పున భూమిని స్వాధీనం చేసుకున్నారు.అధి కాస్త ప్రస్తుతం 11 ఎకరాలు కబ్జా గురైందని సమాచారం. ఎంత అందితే అంత కబ్జా చేసి ప్రభుత్వ ఆస్తిని సొంతం చేసుకున్నారు. అక్కడి నుండి స్వాధీనం చేసుకున్న భూమిని ఏదేచ్ఛగా అమ్మేసుకున్నారు అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జా చెర నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎవరు ఇష్టం వచ్చినట్లు వారు భూమిని



కబ్జా చేసుకుంటూ వెళితే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం శనివారం జగదేవపూర్ మండలం కొత్తపేట గ్రామాన్ని తహసిల్దార్ నిర్మల సిబ్బందితో సందర్శించారు. గ్రామంలో ఉన్న జిపి బిల్డింగ్ నిర్మాణ పనులు ఆగిపోవడంతో విషయాన్ని సర్పంచ్ తుమ్మల జ్యోతి మహేష్ ఆధ్వర్యంలో సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులు తహసీల్దార్ నిర్మల తో ప్రభుత్వ భూమి 523 సర్వే నెంబర్లు కబ్జా గురైందని తెలిపారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ



ఇన్స్పెక్టర్ ఫాహేద్ ని కబ్జా గురైన స్థలానికి పంపించి ఇన్వెస్టిగేషన్ చేయించారు. ఇక్కడ పరిస్థితిని పరిశీలించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ రికార్డు నమోదుచేశారు. ఈ విషయంపై తహసిల్దార్ నిర్మలను వివరణ కోరగా ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాకు గురిచేసిన ఎంతటి వారైనా శిక్షకు అర్హులన్నారు.ఇటిక్యాల రెవెన్యూ కొత్తపేట గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూమి కబ్జాపై పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

# సింహపురిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ ఉక్కుపాదం

**-100 అడుగుల రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాల తొలగింపు**
**-జేసీబీలతో విస్తృతంగా కూల్చివేత చర్యలు**
**-పాదచారుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యమే లక్ష్యమని అధికారుల స్పష్టం**
**-డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్**
**-పోలీసు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా చర్యలు**
**-ప్రభుత్వ భూముల ఆక్రమణలకు తావులేదని హెచ్చరిక**

**దుండిగల్, జూలై 4 కరపత్రం ప్రతినిధి**
దుండిగల్ సర్కిల్ పరిధిలోని సింహపురి కాలనీలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు శనివారం విస్తృత స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 100 అడుగుల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను జేసీబీల సాయంతో తొలగించారు. స్థానికుల నుంచి అందిన



ఫిర్యాదులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పాటు ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించడం, రహదారులను ఆక్రమణల నుంచి విముక్తం చేయడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.



ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్‌తో పాటు జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో కూడా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని హెచ్చరించారు.

# ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 4:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ దివంగత కొనిజెటి రోశయ్య జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జమ్మికుంట మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ రోశయ్య ప్రజా సేవలను, రాజకీయ జీవితాన్ని స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆయన చూపిన అంకితభావం, పరిపాలనలో ప్రదర్శించిన నిబద్ధత చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు.

ఆర్థిక మంత్రిగా రోశయ్య ప్రవేశపెట్టిన పలు బడ్జెట్లు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేశాయని, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, పరిపాలనా దక్షత నేటి తరానికి ఆదర్శమని పేర్కొంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు చందా రాజు, దిడ్డి కోమల, ఒగ్గు రమేష్, గుర్రం కావ్య, లక్ష్మణ్, కొలుగూరి సురేష్, పొనగంటి విష్ణు, యాట్ల సునీత అశోక్, మాచర్ల రాజు, కుతాడి తిరుపతి, జేఏవో రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జ్) ఇల్లందుల రమేష్, దీపిక, టీపీబీవో, ఎం. శ్రీనివాస్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్డు తొలగింపు

**కరపత్రం ప్రతినిధి, వేములవాడ**
వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ సమీపంలో దేవస్థానం భూమిని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డును శనివారం దేవస్థానం ల్యాండ్ ప్రొటెక్షన్ టీమ్ తొలగించింది. భక్తులకు అసౌకర్యం కలుగుతున్న నేపథ్యంలో ఆక్రమణదారునికి పలుమార్లు



హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో చట్టపరమైన విధానాలను అనుసరించి ఆక్రమణను తొలగించినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం భూములపై ఎలాంటి ఆక్రమణలనూ సహించబోమని, ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**▪ వీణవంక మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సాహెబ్ హుస్సేన్**

**కరపత్రం ప్రతినిధి వీణవంక జూలై 4**
వీణవంక మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పిన్‌రెడ్డి లతకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం కింద మంజూరైన రూ.40,000 చెక్కును శనివారం మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, దేవస్థానం ధర్మకర్త జున్నుతుల మధుకర్ రెడ్డి కలిసి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్



పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల కోసం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు.చెక్కు అందుకున్న లత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొత్త సీసీ రోడ్డుతో పద్మానగర్‌కు కొత్త ఊపు.. ఎమ్మెల్యే వివేకానందకు కాలనీవాసుల కృతజ్ఞతలు

**-రోడ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన కాలనీ ప్రతినిధులు**
**-పద్మానగర్ ఫేజ్--2 రోడ్ నెం.24లో పూర్తైన సీసీ రోడ్డు నిర్మాణం**
**-ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్న ఎమ్మెల్యే వివేకానంద అని ప్రశంసలు**
**-కాలనీ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని వినతి**

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్--2, రోడ్ నెం.24లో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి రోడ్డు నిర్మాణానికి సహకరించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అలాగే నూతన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారని కాలనీవాసులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్, కాలనీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, యువ నాయకుడు శౌరి రాజ్, కేదార్‌నాథ్ గడ్డలే, రామదాస్, దశరథ్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను వారు కోరారు. కొత్త సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలు సులభతరమవడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలగిపోయాయని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూలై 05, 2026

## వేములవాడ గురుకులంలో మిగిలిన సీట్లకు 6న స్పాట్ కౌన్సెలింగ్

- కళాశాల ప్రిన్సిపాల్ పి.జ్యోతి



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 6న సిరిసిల్ల బద్దెనపల్లి బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.జ్యోతి తెలిపారు. సీటు రాని, అలాగే ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

## రాజన్న ఆలయానికి ప్రవాసాంధుల విరాళం




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ అభివృద్ధి పనుల కోసం అమెరికాలో స్థిరపడిన వరంగల్‌కు చెందిన ప్రవాసాంధులు జాట్లింగ్ కిరణ్ కుమార్--లక్ష్మి లావణ్య దంపతులు రూ.1,41,000 విరాళాన్ని ఆలయ ఈవో ఎల్ రమాదేవికి శనివారం అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు దంపతులకు శేషవస్త్రం కప్పి వేదాశీర్వచనం అందించి, లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేములవాడ నాయీ బ్రాహ్మణ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ నాయీ బ్రాహ్మణ ఓనర్స్ ఉ వర్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సూత్రం శ్రీనివాస్, ఇన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా కొత్వల నర్సింహులు, కోశాధికారిగా వెలిశాల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా సూత్రం రమేష్, కళ్యాణం లక్ష్మణ్, గంగిపల్లి రవి, వెల్దిరాజు, సారం పెల్లి సంతోష్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ పెరుగుతున్న నిర్వహణ వ్యయాల నేపథ్యంలో హెయిర్ కటింగ్, షేవింగ్ తదితర సేవల ధరలను పెంచాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## మూడపల్లిలో విద్యా విప్లవానికి శ్రీకారం...

- రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- 2,600 మంది విద్యార్థులకు వసతితో కూడిన విద్య
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ



వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, 2,600 మంది విద్యార్థులకు వసతితో కూడిన ఈ ఆధునిక విద్యాసంస్థను 16 నుంచి 18 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యతో పాటు రహదారులు, సాగునీరు, ఆలయ అభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్, అక్రమ ఇసుక రవాణాకు దూరంగా ఉండాలి.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- విలాసాగర్‌లో యువతకు అవగాహన కల్పించిన ఏసీపీ మాధవి -- సీఐ రామకృష్ణ
- యువతతో ప్రతిజ్ఞ చేయించిన పోలీసు అధికారులు






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 4:**
యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హుజురాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) మాధవి సూచించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు పలు సూచనలు చేశారు. జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణతో కలిసి గ్రామ యువకులు, విద్యార్థులు, గ్రామస్తులతో సమావేశమై సమాజ భద్రత, యువత బాధ్యతలు, నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల వ్యాపారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్య, ఉద్యోగం, కుటుంబ జీవితం దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తు అంధకారమవుతుందని అన్నారు. యువత తమ సమయాన్ని క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై వెచ్చించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.
అలాగే కొంతమంది యువకులు తక్షణ ఆర్థిక లాభాల కోసం అక్రమ ఇసుక రవాణా వంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని, ఇది చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అక్రమ రవాణాలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకాలు లేదా రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా దొంగతనాలు, గొడవలు, ఇతర నేరాలను అరికట్టడంతో పాటు నేరస్థులను సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రధాన కూడళ్లు, రహదారులు, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి గ్రామస్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామాల్లో భద్రతా వాతావరణం మెరుగుపడుతుందని, ప్రజల్లో భరోసా పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో, భద్రతా వ్యవస్థ బలోపేతంలో కూడా ప్రజల సహకారం అంతే అవసరమని అన్నారు.
అనంతరం యువతతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ (ప్లెడ్జ్) చేయించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, అక్రమ ఇసుక రవాణా సహా ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనబోమని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తామని, సమాజ అభివృద్ధికి కృషి చేస్తామని యువత ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు, యువకులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి: ఆకుల రాజేందర్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 4:**
ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు కీలక పాత్ర పోషించాలని, నూతన ఓటర్లుగా నమోదు చేసుకునే వారు సంబంధిత ఫారాలను పూర్తి చేసి బీఎల్‌వోలకు అందజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు.
జమ్మికుంట పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను బీఎల్ఏ-2లతో కలిసి సందర్శించిన ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అధికారులు 2002 ఆధారంగా ఓటర్ల మ్యాపింగ్ నిర్వహించారని, కొత్త ఓటు పొందాలంటే అందజేసిన దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఫోటో జతపరచి సమర్పించడం తప్పనిసరి అని వివరించారు. పాత ఓటరు వివరాల ఆధారంగా మాత్రమే ఓటు హక్కు కొనసాగదని, ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.
ఓటర్ల జాబితా సవరణ ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్న ఆకుల రాజేందర్, బీఎల్‌వోలు మరియు బీఎల్ఏ-2లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సమాచారం చేరవేయాలని కోరారు.
అలాగే, ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు లేదా అనర్హుల పేర్లు ఉన్నట్లయితే వాటిపై అభ్యంతరాలు వ్యక్తం చేసి సవరణలు చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధి అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ బచ్చు శివకుమార్, బీఎల్ఏ-2 ఎదలాపురం శ్రీనివాస్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిషన్ హరితోదయం ఘనంగా నిర్వహణ

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి:
- జీఎం జిందాల్ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి






**కరపత్రం ప్రతినిధి రామగుండం, జూలై 4:**
పెద్దపల్లి జిల్లా రామగుండం ఎరువుల కర్మాగారం టౌన్‌షిప్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం మిషన్ హరితోదయం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్మాగారం జనరల్ మేనేజర్ జిందాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ శాంత అధ్యక్షత వహించగా, జీఎం జిందాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలకు అతిథులు అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా జీఎం జిందాల్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో మొక్కల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వాతావరణ కాలుష్యం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా ఎదిగేలా చూడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.
అనంతరం పాఠశాల ఆవరణలో జీఎం జిందాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా మొక్కల నాటకంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.
కర్మాగారం కార్యకలాపాలపై మాట్లాడుతూ, రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో సుమారు 60 శాతం తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం కేటాయిస్తున్నామని జిందాల్ వెల్లడించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి కర్మాగారం కీలకంగా దోహదపడుతోందని పేర్కొన్నారు.
పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యవసాయ రంగాభివృద్ధికి కూడా సంస్థ కట్టుబడి పనిచేస్తోందని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు, అకడమిక్ కోఆర్డినేటర్ జయకుమార్, ఎన్టీపీసీ ప్రిన్సిపల్ ఉదయ్, ఏవో నరేందర్, డీఐఎన్ అనిల్, ఉపాధ్యాయులు ప్రశాంతి, సౌజన్య, పీఈటీలు, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, నక్షత్ర హారతితో భక్తిరసపారవశ్యంలో భగవద్గీత జ్ఞాన మందిరం



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 4:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో శనివారం ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, అనంతరం జరిగిన నక్షత్ర హారతి కార్యక్రమాలు భక్తులను భక్తిరసపారవశ్యంలో ముంచెత్తాయి. ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీమహావిష్ణువు నామస్మరణలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందారు.
వేదమంత్రాల నడుమ ప్రారంభమైన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణంలో మహిళలు, పురుషులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పారాయణం సందర్భంగా ఆలయ ప్రాంగణం భగవన్నామ స్మరణతో మార్మోగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి నక్షత్ర హారతిని వైభవంగా సమర్పించారు.
నక్షత్ర హారతి సమయంలో ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను ఆకట్టుకుంది. హారతి అనంతరం స్వామివారి దివ్య దర్శనం చేసుకున్న భక్తులు తమ కుటుంబాల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తజన సందోహంతో కళకళలాడగా, గోవింద నామస్మరణలు, విష్ణు నామజపాలతో భక్తి భావం వెల్లివిరిసింది.
ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమానికి హాజరైన భక్తులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దాతలు, సేవకులు, భక్తులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక వికాసం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి ధార్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.
కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.